సాక్షి
వికారాబాద్
బుధవారం । 2 । జూలై । 2025



బడి వద్దకే బియ్యం

మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన సన్నబియాన్ని ఇక నుంచి స్కూళ్లకు నేరుగా సరఫరా చేస్తారు. 8లో▸



తాతను చూసేందుకు వచ్చి..

తాతను చూసేందుకు నగరం నుంచి వచ్చిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. 8లో▸



సంత.. తీరని చింత

పూడూరు మండల పరిధిలోని మన్నెగూడ మార్కెట్ యార్డుకు దశాబ్దాలుగా మోక్షం లభించడం లేదు. 9లో▸

న్యూస్‌రీల్

లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన ప్రసాద్‌కుమార్



లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాతో ప్రసాద్‌కుమార్

అనంతగిరి: హర్యానాలోని ధర్మశాలలో జరుగుతున్న వార్షిక కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ ఇండియా రీజియన్, జోనల్ 2 కాన్ఫరెన్స్ సందర్భంగా నిర్వహించిన చర్చల్లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పాల్గొన్నారు. ఈ సమావేశానికి వెళ్లిన తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ధర్మశాలలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు దలైలామాను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

వికారాబాద్‌లో భారీ వర్షం



అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మురుగు నీరు రోడ్ల పైకి చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. రైతు బజార్‌లో అన్నదాతలు తడిసి ముద్దయ్యారు. కొనుగోలు దారులకు కూడా అవస్థలు పడ్డారు.

డీఎంహెచ్ఓగా లలితాదేవి



కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు మొక్కను బహూకరిస్తున్న లలితాదేవి

అనంతగిరి: జిల్లా వైద్యాధికారిగా డాక్టర్. కె.లలితాదేవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన డాక్టర్ వెంకటరవణ ఉద్యోగ విరమణ పొందడంతో హనుమకొండ జిల్లాలో ప్రోగ్రాం ఆఫీసర్(డీటీటీ)గా పనిచేస్తున్న లలితాదేవి బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆమె కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్యాధికారులు, కార్యాలయ సిబ్బంది లలితాదేవికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్: గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలకు రాజకీయ నాయకులు సహకరించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ కోరారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ బూతుల వారీగా బీఎల్‌ఏల వివరాలు వెల్లడించారు. ప్రతి పార్టీ నుంచి బూతు లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు రమేష్‌బాబు, ఇందనూర్ బషీర్, మధుయాదవ్, కృష్ణయాదవ్, ఆసీఫ్ ఖాన్, శేఖర్, నవాజొద్దీన్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన మాజీ ఎంపీపీ



అభినందన సభలో బాలేశ్వర్‌గుప్తా తదితరులు

యాలాల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌రావును యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు పార్టీ మండల అధ్యక్షుడు ఆకుల శివకుమార్, నాయకులు వెంకటేష్ తదితరులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో వీరు పాల్గొన్నారు.

భూమిలేని అతివలకు ఆత్మీయ భరోసా!

మహిళల ఆర్థిక భద్రతకు మరో నూతన పథకం

- ఒక్కొక్కరి ఖాతాలో రూ.6 వేల చొప్పున జమ చేయనున్న ప్రభుత్వం
- ఈ నెలలో ప్రారంభించే అవకాశం
- జిల్లాలో సుమారు 8 వేల కుటుంబాలకు లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళా సంఘాలు

జిల్లా సమాచారం

గ్రామ పంచాయతీలు	-	584
జాబ్ కార్డులు	-	1,28,000
ఉపాధి కూలీలు	-	2,37,000
2025 – 26లో పనిచేసిన కార్డుదారులు	-	91,000
2025 – 26లో పనిచేసిన కూలీల సంఖ్య	-	1,52,000
ప్రస్తుత సీజన్‌లో లబ్ధిదారుల సంఖ్య (అంచనా)	-	8,000

బొంరాస్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక ఎదుగుదలే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుకు సిద్ధమైంది. భూమిలేని అతివలకు ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రూ.6 వేల చొప్పున వారి ఖాతాలో జమ కానున్నాయి. తిరిగి రబీ సీజన్‌లో కూడా మరో రూ.6 వేలు ఇవ్వనుంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని 8వేల మంది వరకు అర్హులు తేలనున్నారు. దీంతో భూమిలేని పేద మహిళలు, నిరాశ్రయులు, మహిళా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహిళల్లో ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. భూమిలేని నిరుపేద కుటుంబాల్లో మహిళలకు ఆర్థికసాయం అందించేందుకు రూపకల్పన చేశారు. జీవనోపాధిని బలోపేతం, కుటుంబ కనీస అవసరాలకు ఆర్థికసాయంగా అందుతుందని ప్రభుత్వ ఉద్దేశం. విత్తనాలు, ఎరువులు, పనిముట్లు, ఇతర అవసరాల కోసం నిధులు ఉపయోగించుకోవచ్చు. ఆహార భద్రతను మెరుగుపర్చుకోవచ్చు. ఇప్పటివరకు అమలవుతున్న రైతు భరోసా పథకంతో కలిపి అమలు చేయనున్నారు.



ఉపాధి హామీ పథకం పనులకు వచ్చిన కూలీలు(ఫైల్)

అర్హులు వీరే..

రాష్ట్ర వ్యాప్తంగా 12లక్షలకు పైగా కుటుంబాలకు లబ్ధి చేకూరేలా నూతన పథకం అమలు చేయనున్నారు. త్వరలో అర్హులను ఎంపిక చేయనున్నారు. అందుకు విధానాలు ఇవే..

- గ్రామీణ ప్రాంతంలోని భూమిలేని కూలీలు, వ్యవసాయ కార్మికులకు ప్రాధాన్యం ఉంటుంది.
- దరఖాస్తుదారు తెలంగాణ శాశ్వత నివాసి అయి ఉండాలి.
- 2025 – 26 ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కనీసం 20 రోజులు పనిచేసి ఉండాలి.
- బ్యాంక్ ఖాతా ఆధార్‌కార్డుతో లింక్ ఉండాలి.

లబ్ధిదారుల ఎంపిక

ఈ పథకం అమలులో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా పూర్తిస్థాయి డిజిటల్ మానిటరింగ్ ఉంటుంది. పథకం పర్యవేక్షణకు ప్రత్యేక అధికార బృందాలు నియమించారు. లబ్ధిదారుల ఎంపికలో గ్రామస్థాయి ధ్రువీకరణ, ఆధార్‌కార్డు, దాని ఆధారిత దరఖాస్తుదారులు గ్రామ పంచాయతీ కార్యాలయం, గ్రామసభలు, అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఫారాలు పొందవచ్చు. పేరు, ఆధార్ నంబరు, బ్యాంక్ ఖాతా, పంటకాలపు పనుల రికార్డు వివరాలను పొందుపర్చి జిరాక్సు పత్రాలు అందజేయాల్సి ఉంటుంది.

పారదర్శకంగా..

మధ్యవర్తుల జోక్యం లేకుండా పారదర్శకంగా డబ్బులు నేరుగా లబ్ధిదారుల చేతికి అందుతుంది. అందుకు డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) వంటి అధికారుల బృందాల పర్యవేక్షణలో పథకం అమలుకానుంది.

పొరపాట్లను సరిచేశాం



మండలంలో ఉన్న జాబ్‌కార్డుల్లో తప్పులు లేకుండా, కార్డుదారుల్లో నమోదైన పొరపాట్లను, అర్హులను ఎంపిక చేసేందుకు అన్ని సవరించాం. అర్హులైన వారిని గుర్తించేలా కొన్ని జాబ్ కార్డులను తీసివేశాం. దీంతో లబ్ధిదారుల ఎంపిక సులువుగా ఉంటుంది.

– ఇలియాస్, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీఓ, బొంరాస్‌పేట

మంచి పథకం



భూమిలేని వ్యవసాయ కార్మిక కుటుంబాలకు, ఉపాధి హామీ కూలీ కుటుంబాలకు, అడ్డా కూలి కుటుంబాలకు ఈ పథకం ఆర్థిక భద్రత కల్పించనుంది. ఏడాదికి రూ.12 వేల చొప్పున ఖరీఫ్, రబీ సీజన్‌లలో అందించనున్నారు. ప్రస్తు త సీజన్‌లో జిల్లాలో 1.5లక్షల మంది ఉపాధి ప నులు చేయగా అందులో సుమారు 8వేల మంది అర్హులు లబ్ధి పొందే అవకాశం ఉంది. ఇదివరకు భూమి ఉన్న వారికే రైతుబంధు, భీమా ఉండేది. ప్రస్తుతం భూమిలేని వారికి ఇది మంచి పథకం.

– జి.నర్సింలుగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, బొంరాస్‌పేట



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, అరవింద్ లింబావళి

ఆలయ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- ముగిసిన మృత్యుంజయ హోమం

తాండూరు రూరల్: మండలంలోని కొత్లాపూర్‌లో వెలసిన రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి దేవాదాయ శాఖ నుంచి రూ.కోటి మంజూరయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. మూడు రోజులుగా ఆలయంలో కొనసాగుతున్న మృత్యుంజయ హోమం మంగళవారంతో ముగిసింది. కర్ణాటక మాజీ మంత్రి అరవింద్ లింబావళితో కలిసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ఆలయం ఎంతో పురాతనమైనదని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో మాట్లాడి నిధులు మంజూరయ్యేలా చూస్తానని తెలిపారు. త్వరలో కల్యాణ మండపం, స్నానపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. నెలరోజుల పాటు జరిగే జాతరకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తారని వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నవీన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, నాయకులు సాయిలు, గోపాల్, రాందాస్, పండరి, రాంచంద్రారెడ్డి, వడ్డె శ్రీను, ప్రదీప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లు రాజు, లాల్యానాయక్, లాలయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు వనజీవి రామయ్య

ఘనంగా జయంతి వేడుకలు

తాండూరు టౌన్: పర్యావరణ పరిరక్షకుడు వనజీవి రామయ్య అందరికీ ఆదర్శనీయుడని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొత్రిక విజయలక్ష్మి అన్నారు. మంగళవారం రామయ్య జయంతిని పురస్కరించుకుని కోకట్ టీజీ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒక్క మొక్క నాటడంతో ప్రారంభించిన వనజీవి రామయ్య తన జీవిత కాలంలో సుమారు 3కోట్ల వరకు మొక్కలు నాటారన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఆయన చేసిన కృషిని మెచ్చిన ప్రభుత్వాలు అనేక అవార్డులతో సత్కరించాయన్నారు. వృక్ష సంపద పెరిగితే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, తద్వారా పంటలు పండటం, పర్యావరణం కలుషిత రహితంగా మారుతుందన్నారు. అందరికీ ఆదర్శంగా నిలుస్తూ వయసు పైబడినా మొక్కలు నాటే ప్రక్రియను మాత్రం ఆయన వదిలిపెట్టలేదన్నారు. కావున అందరూ ఆయనను ఆదర్శంగా తీసుకుని విస్తారంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తాండూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ సరస్వతి, సామాజిక కార్యకర్త వెంకట్, గాజుల బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విజయలక్ష్మి, విద్యార్థినులు



నరేశ్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న డైరెక్టర్లు

పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా నరేశ్

దోమ: పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్‌గా దోమ గ్రామానికి చెందిన కావలి నరేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత నెల 29న మండల కేంద్రంలోని పాలఉత్పత్తిదారుల కేంద్రంలో రెండు డైరెక్టర్ స్థానాలకు అధికారులు ఎన్నికలు నిర్వహించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నలుగురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన బొంపల్లి తండాకు చెందిన బుగ్యానాయక్, దోమకు చెందిన జాకరం నారాయణ విజయం సాధించారు. దీంతో మొత్తం 10 డైరెక్టర్ స్థానాలకు గాను కాంగ్రెస్ ఏడింటిని కైవసం చేసుకుంది. దీంతో కావలి నరేశ్‌ను చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నరేశ్‌ను డైరెక్టర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ జాకటి వెంకటయ్య, డైరెక్టర్లు మల్లేశ్, సత్తమ్మ, లలిత, చందర్, నాయకులు మాలి శివకుమార్‌రెడ్డి మల్లేశ్, జావీద్, యాదయ్య, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తిని వ్యాపారం చేస్తే ఊరుకోం



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న బాగయ్య తదితరులు

- అన్య మతస్తులు కార్పొరేట్ సెలూన్లు పెట్టడానికి వీల్లేదు
- నాయీ బ్రాహ్మణుల సంక్షేమ విభాగం నేతలు, విశ్రాంత ప్రొఫెసర్ బాగయ్య
- అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

అనంతగిరి: కార్పొరేట్ సెలూన్లకు తావివ్వకుండా ప్రభుత్వ పెద్దలు, అధికారులు చొరవ తీసుకొని నాయీ బ్రాహ్మణులు సంక్షేమానికి కృషి చేయాలని ఆ విభాగం నేతలు, విశ్రాంత ప్రొఫెసర్ ఎం.భాగయ్య కోరారు. మంగళవారం వికారాబాద్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్‌ను కలిసి ఈ మేరకు విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిజాం కాలంలో 12 కులాలకు ఇనామ్ భూములు ఇవ్వడం జరిగిందని, ఈ కులాల వారు వృత్తి ధర్మాన్ని నెరవేర్చే సేవకులని గుర్తు చేశారు. ముఖ్యంగా నాయీ బ్రాహ్మణులకు 5 వృత్తి ధర్మాలు ఉన్నాయని, అందులో ఒకటి క్షౌ రము, మంగళ వాయిద్యం, వైద్యము, మంత్రసాని, (కాగడా) దివిటీ. ఉదయం లేచిన కాడి నుంచి అన్ని ముఖ్య దేవాలయాల్లో మేలుకొలుపు నుంచి దివిటీ పట్టే వరకు నాయీ బ్రాహ్మణుల వృత్తి అని పేర్కొన్నారు. 1982లోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఫెడరేషన్లుగా సాధించుకోవడంతో పాటు కులవృత్తికి సంబంధించిన సామగ్రిని కూడా పొందడం జరిగిందన్నారు. ఇతర మతాలకు చెందిన కొందరు వచ్చి సెలూన్లు పెట్టుకొని నాయీ బ్రాహ్మణుల వృత్తి దోచేద్దామని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోవడానికి సిద్ధంగా లేమన్నారు. న్యాయం కోసం హై కోర్టును ఆశ్రయిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి సీపీ రెడ్డి, సంఘం సభ్యులు శేఖర్, రఘుపతి, రమేష్, భగవాన్, నాగరాజు, నరేష్, సంతోష్, రాజు, నర్సింలు, ఎం.నరేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన ‘వనమహోత్సవం’

- వానాకాలం ప్రారంభమై నెలన్నర దాటినా నాటింది 20 శాతంలోపే..
- ఈ ఏడాది లక్ష్యం 40,48,500 మొక్కలు
- 19 ప్రభుత్వ శాఖలకు బాధ్యతలు
- పనులు ప్రారంభించని సగం శాఖలు



పరిగి మండలం బసిరెడ్డిపల్లి నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

వికారాబాద్: జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమం నత్తను తలపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అయితే అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కొన్ని శాఖలు 20 శాతం మేర మొక్కలు నాటగా సగం శాఖలు పనులే ప్రారంభించలేదు. రెండు నెలల క్రితమే జిల్లా అధికారులు ఆయా శాఖలకు మొక్కల లక్ష్యాలను నిర్దేశించారు. ఈ ఏడాది 40.48 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. సీజన్ ప్రారంభ సమయంలో వర్షాలు కురవక పోవడంతో మొక్కలు నాటే కార్యక్రమం ముందుకు సాగలేదు. ప్రస్తుతం వానలు పడుతున్నా అధికారుల్లో చలనం లేదు. వనమహోత్సవంలో ప్రాధాన్యతను బట్టి 19 శాఖలను భాగస్వాములను చేశారు. అటవీ, గ్రామీణాభివృద్ధి శాఖల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం సాగనుంది.

అధికారుల అలసత్వం

మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా వనమహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఏటా లక్షలాది మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. ఇందుకోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 40,48,500 మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకున్నారు. గతేడాది నాటిన మొక్కల్లో 80శాతం బతికాయని అధికారులు చెబుతున్నా వాస్తవానికి 50 నుంచి 60 శాతం మాత్రమే పెరిగినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 8లక్షల లోపు మాత్రమే మొక్కలు నాటారు. పశు సంవర్ధక శాఖ, మైనింగ్, సివిల్ సప్లయ్, పోలీసు, ఆర్అండ్‌బీ, డీడబ్ల్యూఓ, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు కార్యక్రమాన్ని ప్రారంభించలేదు.

581 నర్సరీల్లో పెంపకం

జిల్లా వ్యాప్తంగా అటవీ, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో 581 నర్సరీల్లో 38,30000 మొక్కలను పెంచుతున్నారు. ఈ సారి టేకు మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామ పంచాయతీలకు అత్యధిక లక్ష్యాలను కేటాయించారు.

శాఖల వారీగా కేటాయించిన లక్ష్యం

శాఖ	మొక్కలు
అటవీ	5లక్షలు
విద్య	11వేలు
ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్	9,43,500
ఉద్యానవన	2లక్షలు
వ్యవసాయ	5లక్షలు
తాండూరు మున్సిపాలిటీ	70వేలు
వికారాబాద్ మున్సిపాలిటీ	80వేలు
కొడంగల్ మున్సిపాలిటీ	35వేలు
పరిగి మున్సిపాలిటీ	30వేలు
మరి కొన్ని శాఖలకు లక్ష్యాన్ని నిర్దేశించారు	

ఆర్టీసీని రక్షించుకుంటాం

- కార్మికులను గుండెల్లో పెట్టుకుంటాం
- మంత్రి పొన్నం ప్రభాకర్

హయత్‌నగర్: ఆర్టీసీని రక్షించుకుంటామని, సంస్థను లాభాల్లోకి తీసుకొస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలంలోని మునుగనూరులో మంగళవారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదవాడికి రవాణా సౌకర్యం కల్పించేది ఆర్టీసీ బస్సు మాత్రమేనని అలాంటి బస్సులను నడిపి సేవలు అందిస్తున్న కార్మికులను గుండెల్లో పెట్టుకుంటామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేయాలని చూసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త బస్సులు కొంటున్నామని, పీఆర్‌సీ ఇచ్చామని, కారుణ్య నియమకాలు చేపట్టామని, కొత్తగా ఉద్యోగాలు కల్పిస్తున్నామని వివరించారు. కార్మికుల సంక్షేమం, సంస్థ పరిరక్షణ, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో ఆర్టీసీ పురోగమిస్తోందని అన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల అప్పును మిగిల్చిన గత ప్రభుత్వం ఆర్టీసీని దివాలా తీయించిందని విమర్శించారు. కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించి వారికి అండగా ఉంటామన్నారు. రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన హామీ మేరకు విశ్రాంత కార్మికుల భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీప్రసన్న, ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, విశ్రాంత కార్మిక సంఘం అధ్యక్షుడు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత కార్మిక భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

క్లుప్తంగా

ధ్రువపత్రాల పరిశీలనకు 183 మంది విద్యార్థులు



ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం కళాశాల ప్రవేశాల కోసం స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించామని కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. మొదటి రోజు 194 మంది విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకోగా 183 మంది హాజరయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది నారాయణ, రామలక్ష్మి, సుదీంద్రకుమార్, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఏడుగురు నిందితులకు రిమాండ్



పోలీసుల అదుపులో నిందితులు

దౌల్తాబాద్: భూతగాదాల్లో పాత కక్షలను మనసులో పెట్టుకుని వ్యక్తిని హత్య చేసిన సంఘటనలో పోలీసులు మంగళవారం ఏడుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. జూన్ 30న పొలం బాట విషయంలో బండివాడకు చెందిన వెంకట్ నాయక్, హన్మానాయక్ తండాకు చెందిన జైపాల్ నాయక్, రాములు నాయక్, మాన్యానాయక్, విజయ్ నాయక్, వెంకట్ నాయక్, రవి నాయక్, అమ్రీబాయిల మధ్య గొడవ తలెత్తింది. ఈ ఘటనలో ఇరువర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. వెంకట్‌నాయక్ అదేరోజు రాత్రి తనబైక్‌పై ఇంటికి వెళ్తుండగా హన్మానాయక్ తండా వాసులు దాడి చేశారు. తలకు బలమైన గాయాలవడంతో మృత్యువాతపడ్డాడు. కేసు విచారణ చేపట్టిన పోలీసులు మంగళవారం నిందితులను అరెస్టు చేసి కొడంగల్‌లో కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



దామోదర్‌రెడ్డి(ఫైల్)

దౌల్తాబాద్: నిద్రకు ఉపక్రమించిన ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోనలి గోకఫసల్‌వాద్‌లో మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. గ్రామానికి చెందిన దామోదర్‌రెడ్డి(43), మాజీ కోఆప్షన్ సభ్యుడు జాకీర్‌అలీ కలిసిమెలిసి ఉండేవారు. దామోదర్‌రెడ్డి అప్పుడప్పుడు జాకీర్ ఇంట్లోనే నిద్రించేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇద్దరు జాకీర్‌అలీ ఇంట్లోనే భోజనం చేసి జాకీర్ అలీ పైన గదిలో పడుకోవడానికి వెళ్లగా దామోదర్‌రెడ్డి కింద గదిలో నిద్రించడానికి వెళ్లాడు. మంగళవారం ఉదయం జాకీర్‌అలీ లేచి చూసేవరకు విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే జాకీర్‌అలీ కుటుంబసభ్యులకు తెలిపాడు. వారు వచ్చి చూసి మృతిచెందినట్లు గుర్తించారు. ఈ విషయమై మృతుడి భార్య ప్రభావతమ్మ తన భర్త మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రవిగౌడ్ ఘటనా స్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా రంగారెడ్డి జిల్లా

ట్రోఫీ అందజేసిన సీపీ సాయి చైతన్య



విజేతగా నిలిచిన రంగారెడ్డి జిల్లా జట్టు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజారాం స్టేడియంలో నాలుగు రోజులుగా సాగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు మంగళవారంతో ముగిసాయి. పోటీల్లో విజేతగా రంగారెడ్డి జిల్లా జట్టు నిలువగా, రన్నర్‌గా నిజామాబాద్ జట్టు నిలిచింది. ముగింపు కార్యక్రమానికి సీపీ సాయిచైతన్య ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

బడి వద్దకే బియ్యం

- ఈ నెల నుంచి స్టాక్ పాయింట్ నుంచి నేరుగా పాఠశాలలకు చేరవేత
- రెండేళ్లుగా సొంత ఖర్చులు భరించిన హెచ్‌ఎంలు
- వెతలు తీరాయని హర్షం



కొడంగల్ బియ్యం సరఫరా స్టాక్ పాయింట్

బొంరాస్‌పేట: ప్రభుత్వం సర్కారు బడులకు ప్రతీ నెల అందించే మధ్యాహ్న భోజన పథకం సన్న బియ్యం ఈ నెల నుంచి నేరుగా పాఠశాలలకే చేరనున్నాయి. రెండేళ్లుగా మండల కేంద్రం నుంచి లేదా మార్గమధ్యలో నుంచి సొంత ఖర్చులు భరించాల్సిన బాధలు తొలిగాయని బొంరాస్‌పేట, దుద్యాల ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పాఠశాలలకు రోడ్డు సౌకర్యం లేదని, వర్షాల వల్ల ఇబ్బంది పడుతున్నామని కుంటిసాకులు చెబుతూ బియ్యం సరఫరా కాంట్రాక్టరు రవాణా డబ్బులు జేబులో వేసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. మండల కేంద్రంలో డంప్ చేస్తుండడంతో అవి సకాలంలో పాఠశాలలకు అందక ముక్కిపోయి, పురుగులు పడి పాడైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. మండల కేంద్రం మార్గమధ్య నుంచి హెచ్‌ఎంలు ప్రైవేట్ వాహనాల్లో తమ పాఠశాలలకు మధ్యాహ్న భోజనం బియ్యం తెప్పించుకున్నారు. ఇటీవల ఉన్నతాధికారులు తనిఖీలు చేపట్టిన సమయంలో పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించి సన్నబియ్యం రవాణా ఇబ్బందలు తొలగిస్తామని చెప్పారు. సర్కార్ బడులకు ప్రతీనెల అందించే హమాలీ పేరుతో సీఆర్‌పీల నుంచి అక్రమ వసూళ్లు ఉండరాదని హెచ్చరించారు.

ఉమ్మడి మండలంలో సన్న బియ్యం సరఫరా వివరాలు

పాఠశాలలు	77
విద్యార్థుల సంఖ్య	2,800
ప్రతీ నెల సరఫరా చేసే బియ్యం	76.50 క్వింటాళ్లు
1–5 తరగతుల విద్యార్థులకు	100 గ్రాములు
6–9 తరగతుల విద్యార్థులకు	150 గ్రాములు

ఇన్నాళ్లు ఇబ్బందులు పడ్డాం



కొడంగల్ స్టాక్ పాయింట్ నుంచి నేరుగా మండల కేంద్రానికి లారీలో బియ్యం తెచ్చి అక్కడే డంప్ చేసేవారు. అక్కడి నుంచి పాఠశాలలకు ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు సొంత డబ్బులు వెచ్చించి ప్రైవేట్ వాహనాల్లో తీసుకొచ్చేవారం. అధికారులు స్పందించి బడివద్దకే బియ్యాన్ని చేరవేసే చర్యలు తీసుకున్నారు.

– లక్ష్మీనర్సమ్మ, హెచ్‌ఎం, మదన్‌పల్లితండా

సొంత డబ్బులు ఖర్చుచేశాం



స్టాక్ పాయింట్ వద్ద లేబర్‌కు ఇచ్చే ఖర్చులు సైతం సీఆర్‌పీలమే భరించుకున్నాం. ఇన్నాళ్లు పాఠశాలలకు కాకుండా మార్గమధ్యలో బియ్యం బస్తాలు వేశారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో చివాట్లు పడ్డాం. కొన్నిసార్లు మేమే ప్రైవేట్ రవాణా డబ్బులు వేతనాల నుంచి ఖర్చు పెట్టాం.

– సోమ్లా, సీఆర్‌పీ, బొంరాస్‌పేట

నేరుగా పాఠశాలకే..



ఇన్నాళ్లు బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని ఆయా పాఠశాలలకు రోడ్డు సౌకర్యాలు సరిగా లేకపోవడంతో లారీలు వెళ్లలేక మండల కేంద్రంలోనే డంప్ చేశాం. ఇక నుంచి లారీలోనే నేరుగా పాఠశాలకు మధ్యాహ్న భోజన పథకం బియ్యం బస్తాలను చేరవేస్తాం

– బషీర్, బియ్యం సరఫరా కాంట్రాక్టర్

తాతను చూసేందుకు వచ్చి..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



భార్య, కూతురుతో రాము(ఫైల్)

బషీరాబాద్: తాతను చూసేందుకు నగరం నుంచి వచ్చిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. ఈ ఘటన బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి ఇందర్‌చెడ్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్, మృతుడి బంధువులు తెలిపిన ప్రకారం.. మూడు రోజుల క్రితం మండల కేంద్రంలోని జయంతి కాలనీలో నివాసం ఉండే సంకుల బోనప్పను చూసేందుకు తన మనవడు బైలుపాటి రాము(25) హైదరాబాద్ నుంచి వచ్చాడు. మంగళవారం చేపలు తీసుకువచ్చేందుకు తాతామనుమడు కలిసి బైక్‌పై ఇందర్‌చెడ్ సమీపంలోని చెరువుకు వెళ్లారు. చేపలు విక్రయించే వారు లేక వెనుదిరిగారు. ఈ క్రమంలో ఇందర్‌చెడ్– బషీరాబాద్ మార్గంలో మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రాము తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. బోనప్ప గాయాలతో పడి ఉండడంతో గమనించిన వాహనదారులు వారి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు అక్కడకు చేరుకుని తాండూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలంలో వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా తల్లిదండ్రులు లేని మృతుడికి భార్య మంగమ్మ గర్భిణి, మూడేళ్ల కూతురు ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రయిస్తే రూ.లక్ష జరిమానా



తీర్మాన పత్రం చూపుతున్న యువజన సంఘాల నాయకులు

కుల్కచర్ల: గ్రామంలో మద్యం అమ్మకాల వల్ల యువత చెడుమార్గంలో వెళ్తోందని గమనించారు. మద్యం అమ్మకాలను నిషేధించాలని నిర్ణయించుకుని ముందడుగు వేశారు. మంగళవారం మండల పరిధిలోని బండవెల్కిచర్లలో బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామని తీర్మానించారు. గ్రామ అభ్యున్నతికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో స్థానిక యువజన సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా పంపిణీ



రేషన్ బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న నాయకులు

కుల్కచర్ల: ప్రజలకు ఇబ్బంది లేకుండా రేషన్ సరుకుల పంపిణీ సమయాన్ని పెంచడం జరుగుతుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రేషన్ బియ్యం పంపిణీ కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. రేషన్‌బియ్యం ప్రతీ ఒక్క లబ్ధిదారుడికి మూడు నెలల బియ్యం చేరాలనే సంకల్పంతో జూలై 29 వరకు రేషన్ బియ్యం తీసుకునేందుకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆనందం, మాజీ ఎంపీపీ అంజిలయ్య, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు రాంచంద్రయ్య, వెంకటేశ్, ఎల్లయ్య, భాను తదితరులు పాల్గొన్నారు.

మహిళ బలవన్మరణం

మొయినాబాద్: భర్తతో గొడవపడి ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండల పరిధిలోని శ్రీరాంనగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి పోచయ్య డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో ఇంటికే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో ఆయన భార్య రాణి(35) ఇదే విషయంలో తరచూ భర్తతో గొడవపడుతుండేది. సోమవారం రాత్రి దంపతులిద్దరూ మరో మారు గొడవపడి పోచయ్య ఇంటి నుంచి వెళ్లి తన తల్లి దగ్గర పడుకున్నాడు. మంగళవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చాడు. భార్య ఎంతకీ తలుపుతీయకపోవడంతో చుట్టు పక్కలవారు వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా ఆమె చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఏడు ఆవుల అపహరణ

కొత్తూరు: గుర్తు తెలియని దుండగులు ఏడు ఆవులను అపహరించుకెళ్లారు. ఈ ఘటన మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత రైతులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రోళ్ల గోపయ్యకు చెందిన రెండు ఆవులు, వన్నం లక్ష్మమ్మవి నాలుగు ఆవులు, ఎర్రోళ్ల వెంకటయ్యకు చెందిన ఒక ఆవు అపహరణకు గురైయ్యాయి. కాగా బాధిత రైతులు రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి వారి పశువుల పాకల్లో ఆవులను కట్టేసి ఇంటికి వచ్చారు. మరుసటి రోజు ఉదయం పొలాలకు వెళ్లగా ఆవులు కనిపించలేదు. చుట్టు పక్కల పొలాల్లో వెతకుతున్న సమయంలో ముగ్గురు రైతులు తమ ఆవులు చోరీకి గురైనట్లు తెలుసుకుని పోలీసులకు సమాచారం అందజేశారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు జరుపుతున్నారు. చోరీకి గురైన ఒక్కో ఆవు ధర సుమారుగా రూ.80 వేలు ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీ టీచర్‌పై విచారణ



బట్లచందారంలో వివరాలు తెలుసుకుంటున్న సీడీపీఓ మెహర్‌ఉన్నీసా బేగం

దోమ: కోడిగుడ్ల పంపిణీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అంగన్‌వాడీ టీచర్‌పై సీడీపీఓ మెహర్‌ఉన్నీసా బేగం విచారణ చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని బట్ల చందారం గ్రామంలో కావలి మంగమ్మ(గర్భిణీ)కి అంగన్‌వాడీ టీచర్ ఆనంద గుడ్లు ఇవ్వాల్సి ఉంది. అయితే ఆమె పేరు నమోదు కాకపోవడంతో హైదరాబాద్ నగరంలో ఉంటూ మే 20న వచ్చి కేంద్రంలో రిజిస్టర్ చేసుకుంది. ఈ క్రమంలో జూన్ 20న అంగన్‌వాడీ కేంద్రానికి గుడ్లకు రాగా.. టీచర్‌తో మంగమ్మ భర్త సురేశ్ ఫోన్‌లో చిన్నపాటి వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటమాట పెరగడంతో టీచర్ ఆనంద, ఆమె భర్త వీరప్పతో కలిసి సురేశ్ ఇంటికి వెళ్లి దాడి చేశారు. ఈ మేరకు ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేసుకోగా, గత నెల 21న ఆనంద, వీరప్పలపై కేసు నమోదు చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అంగన్వాడీ టీచర్‌పై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీడీపీఓ, డీడబ్ల్యూఓకు ఫిర్యాదులు సైతం చేశారు. ఈ మేరకు మంగళవారం సీడీపీఓ గ్రామానికి వచ్చి గ్రామ మాజీ సర్పంచ్‌తో పాటు గ్రామస్తులతో కలిసి విచారణ చేపట్టారు.

విద్యతోనే అంతరాలు లేని సమాజం



తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించిన నర్సింహారెడ్డి తదితరులు

మాజీ ఎమ్మెల్సీ నర్సింహారెడ్డి

మంచాల: విద్య సమాజాభివృద్ధికి తోడ్పాటునిచ్చేలా ఉండాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించారు. అక్కడ కొనసాగుతున్న పనులు, బోధన తీరు, ఉపాధ్యాయుల కృషిని తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఆరుట్లలో ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. ప్రజల మధ్య అంతరాలు తొలగాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధేశ్యాం, ఉపాధ్యక్షురాలు మంగ, సభ్యులు నాగమణి, ధనమూర్తి, జగన్నాథ్ ఆరుట్ల ప్రధానోపాధ్యాయుడు గిరిధర్ గౌడ్, సుప్రియ, మోహన్ గౌడ్, పేరెంట్స్ కమిటీ సభ్యులు భాస్కర్, రాజు, ఎం.డీ.జానీ పాష, జంగయ్య, జంగయ్య, మల్లేశ్, పార్వతి, జ్యోతి, ఉపాధ్యాయులు పాపిరెడ్డి, కిషన్ చౌహాన్, శ్రీకాంత్, జహీర్ పాల్గొన్నారు.

సిగ్గుపడాల్సింది పోయి దాడులు చేస్తారా

మంత్రి జూపల్లి కృష్ణారావు

షాద్‌నగర్ రూరల్: రాష్ట్రంలో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వచ్చిన ఆరోపణలపై బీఆర్‌ఎస్ నాయకులు సిగ్గు పడాల్సిందిపోయి దాడులు చేస్తామని మాట్లాడడం సిగ్గుచేటని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం ఆయన కన్హశాంతి వనంకు వెళ్తున్న ఆయనకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారు ఎవరైనా ప్రభుత్వం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని అన్నారు. అనంతరం ఆయన జూనియర్ కళాశాల భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల నిర్మాణం ఓ మహత్తర కార్యక్రమని ఎమ్మెల్యే గొప్ప ఆశయంతో ముందుకు సాగుతున్నారని శభాష్ శంకర్ అంటూ అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, నాయకులు తిరుపతిరెడ్డి, రఘునాయక్, ఎండీ.ఇబ్రహీం, కృష్ణారెడ్డి, బస్వం, మోహన్, ముబారక్‌అలీ, మురళీమోహన్, సీతారాం, అశోక్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ



రామాలయంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు



దుండగుడు విగ్రహాలను మోసుకెళ్తున్నట్లు సీసీ కెమెరాలో కనిపించిన దృశ్యం

పంచలోహ విగ్రహాలను ఎత్తుకెళ్లిన దుండగులు

ఇబ్రహీంపట్నం: డివిజన్ పరిధిలోని ఓ గ్రామంలో రెండు ఆలయాల్లో విగ్రహాలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలోని పోలకంపల్లిలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం గ్రామంలోని రామాలయంలో సీతారామలక్ష్మణ స్వాముల వారి పంచలోహ విగ్రహాలు, గంగాదేవి ఆలయంలో పెద్దమ్మ తల్లి, గంగాదేవి విగ్రహాలను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. రామాలయంలోని సీసీటీవీ పుటేజీలను పరిశీలించగా ఓ దొంగ విగ్రహాన్ని సంచిలో పెట్టుకుని వెళ్తున్నట్లు గుర్తించారు. అనుమానితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

దుండగులను అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

- లేదంటే ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

పరిగి: పుట్టపహాడ్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను అరెస్ట్ చేయడంలో పోలీసులు విఫలమయ్యారన్నారు. దుండగులను పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం వ్యహరిస్తున్నారన్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని అరెస్ట్ చేయకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గోవింద్‌నాయక్, వెంకట్, సత్తయ్య పాల్గొన్నారు.

ఖర్చుకు వెనుకాడొద్దు

- నిధులు మంజూరు బాధ్యత నాది
- కలెక్టర్ నారాయణరెడ్డి
- వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ
- సమస్యలు వివరించిన మహేశ్వరం మెడికల్ కాలేజీ అనుబంధ ఆస్పత్రి వైద్య సిబ్బంది



ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'కోవిడ్ సమయంలో ఆస్పత్రి భవనంపై ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డు పైకప్పు లీకేజీ అవుతోంది. సిటీ స్కాన్ మంజూరైనప్పటికీ.. స్థలాభావ సమస్యతో ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. టెక్నీషియన్లు అందుబాటులో లేరు. రక్తనిధి కేంద్రం లేకపోవడంతో రక్తస్రావంతో బాధపడుతున్న రోగులకు సత్వర సేవలు అందించలేకపోతున్నాం. వైద్యుల నిష్పత్తి మేరకు గదులు లేకపోవడంతో ఔట్ పేషంట్ విభాగానికి వచ్చే రోగులకు సేవలు అందించలేని పరిస్థితి తలెత్తుతోంది' అంటూ మహేశ్వరం మెడికల్ కాలేజీ అనుబంధ ఆస్పత్రి (వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి) వైద్య సిబ్బంది కలెక్టర్ నారాయణరెడ్డి ముందు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. వైద్యులు, సిబ్బంది చెప్పిన అంశాలను కలెక్టర్ సావధానంగా ఆలకించారు. 'ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించే బాధ్యత నాదీ.. అయితే ఆస్పత్రికి ఆపదలో వచ్చిన నిరుపేద రోగులకు సత్వర, మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాల్సిన బాధ్యత మీదే' అని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఆకస్మిక తనిఖీ.. వైద్యసేవలపై ఆరా

మంగళవారం వనస్థలిపురం ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఔట్, ఇన్ పేషంట్ విభాగాలు సహా ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్య పరీక్షలు చేస్తున్నారా? మందులు ఇస్తున్నారా? అంటూ రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది రోగుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రి పడకల సామర్థ్యాన్ని 100 నుంచి 200 పెంచారు కానీ..అనువైన స్థలం లేక అదనపు పడకలను ఏర్పాటు చేయలేకపోతున్నట్లు స్పష్టం చేయగా, ఆస్పత్రి భవనం పై అంతస్తులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్డుకు తక్షణమే రిపేర్లు చేసి, రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు ఎంత ఖర్చైనా వెనుకాడొద్దన్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సీటీస్కాన్ పెట్టండి.. టెక్నీషియన్లను తీసుకోండి

మెడికల్ కాలేజీ నిబంధనల ప్రకారం ఆస్పత్రిలో సీటీస్కాన్ ఏర్పాటు చేయాల్సి ఉందని, 2024లోనే సీటీస్కాన్ మంజూరైందని, ఆస్పత్రిలో అనువైన స్థలం లేక ఏర్పాటు చేయలేకపోయినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఆస్పత్రి ఆవరణలోని ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ డిస్పెన్సరీలను పక్కనే ఉన్న వార్డు ఆఫీసుకు తరలించి, ఆ ఖాళీ ప్రదేశంలో సీటీస్కాన్ ఏర్పాటు చేయించాలని అధికారులకు సూచించారు. రక్తనిధి కేంద్రం ఏర్పాటు సహా అవసరమైన టెక్నీషియన్లను ఔట్‌సోర్సింగ్ ప్రతిపాదికను నియమించుకోవాలని ఆదేశించారు. రోగులకు సేవలు అందించే విషయంలో రాజీపడొద్దన్నారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్యలోపం, తాగునీటి కొరత లేకుండా చూసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, అదనపు డీఎండీ డాక్టర్ వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ త్రివేణి, వైస్ ప్రిన్సిపాల్ తఖీయుద్దీన్, ఆర్‌ఎంఓలు జయమాల, రాజ్‌కుమార్, వైద్య మౌలిక సదుపాయాల సంస్థ చీఫ్ ఇంజనీర్ దేవేందర్, ఈఈ అజీజ్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, ఎల్బీనగర్ డిప్యూటీ కమిషనర్ యాదయ్య తదితరులు ఉన్నారు.